సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ׀ 11 ׀ మార్చి ׀ 2025



**సోమశిలలో 54.437 టీఎంసీలు**

సోమశిల: జలాశయంలో సోమవారం 54.437 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఫైతట్టు ప్రాంతాల నుంచి 792 క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చి చేరుతోంది.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10 గ్రాములు) | రూ.88,940 |
| 22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) | రూ.8,053 |
| మూడు శాతం జీఎస్టీతో | రూ.8,295 |
| నవర (8 గ్రాములు) | రూ.66,360 |

గరిష్టం/కనిష్టం
34.1 /24.6

**వాతావరణం**

మంగళవారం జిల్లాలో వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 56 శాతంగా నమోదైంది.

**రంజాన్ వేళలు**

| ఇఫ్తార్ | సహర్ |
|---|---|
| మంగళవారం | బుధవారం |
| సా: 6.20 | ఉ: 5.00 |

## న్యూస్‌రీల్

### శనగల కొనుగోలుకు నేటి నుంచి రిజిస్ట్రేషన్లు

సాక్షి ఎఫెక్ట్..

**ఉదయగిరి:** జిల్లాలో శనగ పంట ఉత్పత్తులను ప్రభుత్వ మద్దతు ధరకు విక్రయించేందుకు రైతులు మంగళవారం నుంచి మార్చి 20వ తేదీ వరకు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని జేసీ కార్తీక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 7వ తేదీన 'శనగ రైతు.. దైన్యం' శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. అధికారులు స్పందించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యాక రైతుల నుంచి మద్దతు ధర రూ.5,650కు కొనుగోలు చేస్తామని తెలిపారు.

### కలెక్టరేట్ వద్ద వీహెచ్‌పీ ధర్నా



మాట్లాడుతున్న నేతలు

**నెల్లూరు రూరల్:** అన్నమయ్య జిల్లా రాయచోటిలో వీరభద్రస్వామి ఆలయ పార్వేట ఉత్సవం సందర్భంగా భక్తుల ఊరేగింపుపై అన్యమతస్తుల దాడిని నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రశాంతంగా ఉత్సవాన్ని నిర్వహించుకునే హిందువులపై అన్యమతస్తులు దాడి చేస్తే.. అందుకు హిందూ సంస్థలను బాధ్యుల్ని చేస్తూ కేసులు పెట్టడం దారుణమన్నారు. హిందువులను, ఆ సంస్థలను కించపరిచే విధంగా పోలీసులు ప్రవర్తించడం, దేశభక్త సంస్థలైన ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీలపై కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.

### నాగులవెల్లటూరు చెరువుకు గండి



**చేజర్ల:** మండలంలోని నాగులవెల్లటూరు గ్రామ చెరువుకు సోమవారం గండి పడింది. సోమశిల దక్షిణ కాలువ నీటితో చెరువు నిండి కట్ట తెగింది. సమాచారం అందుకున్న సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవచౌదరి సోమవారం సాయంత్రం చెరువు దగ్గరకు చేరుకుని పరిశీలించారు. సోమశిల దక్షిణ కాలువ 5ఎస్ నుంచి విడుదలయ్యే నీటిని తాత్కాలికంగా నిలుపుదల చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే మరమ్మతులు చేపడతామని, రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నిరంతరం పరిస్థితిని సమీక్షిస్తూ చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. అయితే ఇరిగేషన్ అధికారులతో ఈ విషయమై మాట్లాడేందుకు ఫోన్ ద్వారా సంప్రదించగా సరిగా స్పందించలేదు.

### వాడింది 5 యూనిట్లు.. వచ్చిన బిల్లు రూ.945



విద్యుత్ బిల్లు

**నెల్లూరు(వీఆర్సీ సెంటర్):** ఓ వినియోగదారుడు తన దుకాణానికి నెలరోజులపాటు తాళం వేసి ఒక జీరో బల్బు వేసి ఉంచితే నెలకు అయిన విద్యుత్ వినియోగం 5 యూనిట్లు మాత్రమే. అయితే వచ్చిన బిల్లు మాత్రం రూ.945. నెల్లూరు నగరానికి చెందిన న్యాయవాది బసిరెడ్డి నారాయణరెడ్డికి రామ్మూర్తినగర్ విద్యుత్ సెక్షన్ పరిధిలో ఓ దుకాణం ఉంది. 3321214186941 నంబరుతో విద్యుత్ సర్వీస్ కనెక్షన్ ఉంది. దీనిని బాడుగకు తీసుకున్నవారు గత నెల ఖాళీ చేశారు. అందులో ఒక జీరో బల్బు మాత్రమే వేసి ఉండటంతో ఫిబ్రవరి నెల మొత్తానికి 5 యూనిట్లు విద్యుత్ మాత్రమే ఖర్చు అయ్యింది. దీనికి చెల్లించాల్సింది రూ.65 మాత్రమే. కానీ బిల్లులో వివిధ చార్జీలతో కలిపి మొత్తం రూ.945 బిల్లు వచ్చింది.

# బెల్టు జోరు పల్లె బేజారు

బెల్టు షాపులు పెడితే తానే బెల్టు తీస్తానని, నిర్వాహకులను వదిలే ప్రసక్తే లేదని, వారికి మద్యం సరఫరా చేసే దుకాణాలపై కేసులు నమోదు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన హెచ్చరికలను నెల్లూరు ఎక్సైజ్ శాఖ అధికారులు పెడచెవిన పెట్టారు. సీఎం ఆదేశాలను బేఖాతరు చేస్తూ వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తూ విచ్చలవిడి విక్రయాలకు తెరలేపగా, ముందస్తు ఒప్పందాలతో మొక్కుబడి చర్యలకే అధికారులు పరిమితమయ్యారు.



**ఊరూవాడా అనధికారికంగా విక్రయాలు**

- డోర్ డెలివరీ చేస్తున్న వైన్ షాపుల యజమానులు
- రాత్రివేళ అయితే బాటిల్‌పై రూ.50 అదనం
- బెల్టు నిర్వాహకులతో ఎక్సైజ్ శాఖ కుమ్మక్కు
- ఇల్లు, ఒళ్లు గుల్లచేసుకుంటున్న మద్యం ప్రియులు



వనంతోపు సెంటర్ వద్ద మద్యం దుకాణం

➡ ఇది నెల్లూరు నగరంలోని వనంతోపు సెంటర్‌లో ఉన్న మద్యం దుకాణం.షాపు పక్కనే కూల్‌డ్రింక్స్ షాపు పేరుతో బెల్టు దుకాణం ఏర్పాటు చేశారు. అక్కడ ఎనీటైం మందు అందుబాటులో ఉంచారు. బెల్టు దుకాణంలో మాత్రం బాటిల్‌పై అదనంగా రూ.20 వరకు వసూలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతోంది. కానీ.. అధికారులకు మాత్రం కనిపించదు.



పక్కనే ఉన్న బెల్టు షాపులో మద్యం తాగుతూ..



వెంకటాచలంలో బార్‌ను తలపించేలా మద్యం దుకాణంలో ఏర్పాట్లు

➡ ఇది వెంకటాచలం నుంచి కసుమూరుకు వెళ్లే మార్గంలో ఉన్న మద్యం దుకాణం. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా బార్‌ను తలపించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఇక్కడ రేయింబవళ్లు మద్యం అమ్మకాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మస్తాన్‌వలీ దర్గా ఉన్న కసుమూరు గ్రామంలో కూడా విచ్చలవిడిగా బెల్టు దుకాణంలో మద్యం అమ్మకాలు చేస్తున్నారు. బెల్టు షాపు నిర్వాహకులు రూ.150 ఎమ్మార్పీ ఉన్న క్వార్టర్ మద్యం బాటిల్‌ను రూ.200కు అమ్ముకుంటున్నారు.



మాచవరం కొండ ఎస్టీ కాలనీ వద్ద బెల్టు షాపు

➡ కందుకూరు మండలం మాచవరం గ్రామంలో ఐదు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. వీటిపై పోలీసులు గానీ, ఎక్సైజ్ అధికారులు గానీ దాడి చేయరు. పగలు, రాత్రి తేడా లేకుండా మందు విక్రయిస్తున్నారు. పగటి పూట క్వార్టర్ బాటిల్‌ను రూ.60 నుంచి రూ.70ల వరకు అదనంగా అమ్ముతున్నారు. అదే రాత్రి 9 గంటలు దాటితే బాటిల్‌పై రూ.100 వరకు తీసుకుంటున్నారు. మాచవరం కొండ వద్ద ఎస్టీ కాలనీ కావడంతో ఎక్కువగా రద్దీగా ఉంటుంది. ఇక్కడ ఎస్టీలు ఎక్కువగా ఉండడంతో కాయకష్టం చేసి తెచ్చుకున్న డబ్బంతా మద్యానికి ఖర్చు పెడుతున్నారు.

**సాక్షి ప్రతినిధి, నెల్లూరు:** జిల్లాలో 182 మద్యం దుకాణాలు, 55 బార్‌లు ఉండగా వాటికి పదింతలుగా 2 వేలకు పైచిలుకు బెల్టుషాపులు వెలిశాయి. ఊరూవాడ మద్యం ఏరులై పారుతోంది. బెల్టు వ్యాపారం మూడు క్వార్టర్లు, ఆరు బీర్లు అన్న చందాన సాగుతోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం బెల్టు షాపుల నిర్వహణ నేరం. అయితే మద్యం వ్యాపారం అధికార పార్టీకి చెందిన వారి చేతుల్లోకి వెళ్లడంతో పట్టణాలు, గ్రామాల్లో బెల్టు షాపులను ఏర్పాటు చేశారు. నేరుగా మద్యం దుకాణాల నుంచే వాటికి మద్యం సరఫరా అవుతోంది. గతంలో బెల్టు షాపుల్లో కేవలం చీప్ లిక్కర్ మాత్రమే అందుబాటులో ఉండేది. ప్రస్తుతం అన్ని రకాల బ్రాండ్లు, బీర్లూ అందుబాటులో ఉన్నాయి. క్వార్టర్, బీరుపై అదనంగా రూ.50 వరకు మందుబాబుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. మద్యం షాపులు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు, బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు తెరచి ఉంటున్నాయి. అయితే బెల్టు షాపుల్లో మాత్రం 24 గంటలూ మద్యం విక్రయాలు సాగుతున్నాయి. ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన కూటమి సర్కార్ మద్యంను మాత్రం మందుబాబుల చెంతకు చేర్చి వారిని మత్తుకు మరింత బానిసలుగా మార్చింది. ఆర్థికంగా గుల్ల చేస్తోంది. సంపద సృష్టిస్తామని ఎన్నికల ముందు పదేపదే చెప్పిన చంద్రబాబు నాయుడు ఈ తరహాలో జనం జేబుల్లో నుంచి సొమ్ము గుంజుకుంటూ ఖజానాను నింపుకొంటున్నారన్న విమర్శలున్నాయి.

**బెల్టుషాపులే కీలకం**

మద్యం అమ్మకాల్లో బెల్టుషాపులు కీలకంగా మారాయి. వీటికి రూ.లక్షల్లో వేలం పాటలు నిర్వహించి మరీ ఏర్పాటు చేయడం విశేషం. మద్యం షాపుల్లో 40 శాతం విక్రయాలు సాగితే బెల్టు దుకాణాల్లో 60 శాతం విక్రయాలు సాగుతున్నాయి. జిల్లాలో రోజుకు ఆరు లక్షల మంది మద్యతాగుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి. ప్రశాంతమైన పల్లెల్లో బెల్టు దుకాణాలు చిచ్చురేపుతున్నాయి. నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలను బలి తీసుకుంటున్నాయి.

**మినీ బార్లు**

గత సర్కారు ప్రజలకు మేలు చేసే విధంగా ప్రభుత్వమే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసింది. నిర్ణీత సమయంలో మాత్రమే విక్రయాలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం పాలసీ ప్రైవేట్ పరం చేసింది. దుకాణాలు దక్కించుకున్న వ్యాపారులు విచ్చలవిడి విక్రయాలకు తెరలేపారు. ప్రతి దుకాణం పక్కనే అనధికారిక పర్మిట్ రూమ్‌లు కొనసాగుతున్నాయి. ఇవి మినీబార్లను తలపిస్తున్నాయి.

**ధాబాల్లోనూ..**

జిల్లాలో చిన్నా, పెద్దా కలిపి 300 పైచిలుకు ధాబాలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయించాలంటేనే భయపడే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పరిస్థితి మారిపోయింది. కూటమి నేతల అండదండలతో అధికశాతం ధాబాల నిర్వాహకులు యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. మద్యం మీరు తెచ్చుకున్నా సరే.. లేదంటే సిబ్బందే సమకూరుస్తారని మందుబాబులకు నిర్వాహకులు ఆఫర్ ఇస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి అర్ధరాత్రి ఒంటి గంట వరకు మద్య సేవనం చేయిస్తున్నారు.

**ఒక్క మద్యం దుకాణంపైనా కేసు లేదు**

వ్యాపారులతో ఇప్పటికే అధికారులు మామూళ్లు ఫిక్స్ చేసుకుని, అనధికార మద్యం విక్రయాలు, నిబంధనల ఉల్లంఘనలపై నామమాత్రపు చర్యలకే పరిమితమయ్యారన్న విమర్శలున్నాయి. బెల్టు విక్రయాలపై దాడులు చేసి నిర్వాహకుల అరెస్ట్‌లతో సరిపెట్టుకుంటున్నారు. అసలు బెల్టుషాపునకు మద్యం ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు సరఫరా చేశారు? అనే మూలాల్లోకి వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇంత వరకు ఒక్క మద్యం దుకాణంపై కూడా కేసు నమోదు కాకపోవడం గమనార్హం. అధికారులు మాత్రం పట్టుబడిన మద్యం సీసాలపై లేబుళ్లు లేని కారణంగా అవి ఏ దుకాణం నుంచి వచ్చాయో తెలుసుకోలేక పోతున్నామని చెబుతున్నారు.

**బెల్టుపై కఠినంగా వ్యవహరిస్తున్నాం**

బెల్టు షాపులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. స్టేషన్‌ల వారీగా దాడులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 535 కేసులు నమోదు చేసి 545 మందిని అరెస్ట్ చేశాం. వారి వద్ద నుంచి 1,325 లీటర్ల మద్యం, 62 లీటర్ల బీరును స్వాధీనం చేసుకున్నాం. బహిరంగ మద్య సేవనంపై 172 కేసులు నమోదు చేశాం. బెల్టుకు మద్యం సరఫరా చేసే దుకాణదారులపై చర్యలు తప్పవు.

– ఎ.శ్రీనివాసులునాయుడు, డీపీఈఓ

➡ ఇది సీతారామపురంలోని సన్‌రైజ్ వైన్ షాపు. దానికి అనుబంధంగానే అనధికారికంగా పర్మిట్ రూమ్ ఏర్పాటు చేసి అక్కడే మద్యం తాపిస్తున్నారు. వైన్ షాపు పక్కనే బార్‌ను తలపించేలా సౌకర్యాలు ఏర్పాటు చేసి మద్యం తాగేలా చేస్తున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం పట్టించుకోరు. దుకాణం టైమ్ ముగిసిన తర్వాత కూడా అక్కడ మద్యం దొరుకుతుంది. బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నారు.



దుకాణం వద్ద మద్యం సేవిస్తున్న మందుబాబులు

# రైతన్నకు అండగా ఉంటాం

- మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయాలి
- హామీలను విస్మరించిన చంద్రబాబుది మోసపూరిత వైఖరి
- ధ్వజమెత్తిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి
- విడవలూరులో రైతులతో ర్యాలీ, ధర్నా



ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విడవలూరులో రైతుల ర్యాలీ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి, నాయకులు

**విడవలూరు:** ధాన్యానికి గిట్టుబాటు ధరను కల్పించి, రైతులను ఆదుకోవాలని కోవూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అన్నదాతలకు అండ.. వైఎస్సార్‌సీపీ అజెండా అనే నినాదంతో విడవలూరులోని అంకమ్మతల్లి దేవస్థానం వద్ద సోమవారం ఆయన ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడకు చేరుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, రైతులతో కలిసి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. తర్వాత వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు, డీఏఏబీ మాజీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్క రైతును ఆదుకున్నాడన్నారు. రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లను అందుబాటులో ఉంచారని తెలిపారు. రైతు భరోసా సొమ్ము జమ చేశాడని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి రైతన్నలను రోడ్డుపాలు చేసిందని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాలను చూస్తే భయమేస్తుందన్న వ్యక్తి 2029లో సూపర్ 10 పథకాలతో మళ్లీ మనముందుకు వస్తాడని, అప్పుడు రైతులే తగిన బుద్ధి చెప్పాలన్నారు. కోవూరు నియోజకవర్గంలో రైతులు పండించిన పంటను అమ్ముకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. ఇకనైనా రెవెన్యూ, వ్యవసాయ, సివిల్ సప్లయ్స్ విభాగాల అధికారులు రైస్ మిల్లర్లతో సమన్వయం చేసుకుంటూ మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, ఇందుకూరుపేట మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు కొండూరు వెంకటసుబ్బారెడ్డి, బుచ్చిరెడ్డిపాళెం నగర కన్వీనర్ షేక్ షాహుల్, కౌన్సిలర్లు షకీలా బేగం, ప్రమీలమ్మ, జయంతి, అనంతలక్ష్మి, యానాదిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

# మెట్టింటోళ్లు గెంటేశారు

- పుట్టింటోళ్లూ వదిలేశారు
- నేనెక్కడ బతకాలంటున్న ఓ ఇల్లాలు

**కందుకూరు రూరల్:** మెట్టినింటితోపాటు పుట్టింట్లో కూడా చోటివ్వకుండా ఓ ఇల్లాలిని వేధింపులకు గురిచేస్తున్న వైనం మండలంలోని పలుకూరులో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్రామానికి చెందిన బి.మాలకొండయ్య, ఈశ్వరమ్మ దంపతుల కుమారుడు అంకారావుకు మేనత్త కుమార్తె పద్మతో వివాహమైంది. అప్పటికే అంకారావు దివ్యాంగుడు. బంధువు కావడంతో పద్మ మేజర్ కాకముందే పెళ్లి చేశారు. అయితే అంకారావుకు నయం కాని వ్యాధి ఉంది. వారికి ఓ బిడ్డ పుట్టాక అతను మృతిచెందాడు. భర్త మరణంతో వచ్చిన రూ.10 లక్షల బీమా సొమ్మును మామ బెదిరించి తీసుకున్నాడు. ఏడాది క్రితం పొదుపులో వచ్చిన నగదు కూడా ఇవ్వాలని అత్తామామలు వేధించడంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. తల్లి కూడా మామ చెల్లెలు కావడంతో పద్మను అక్కడికి కూడా రానివ్వలేదు. దీంతో హైదరాబాద్‌లో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లి తలదాచుకుంది. గత నెలలో శివరాత్రి పండగకు గ్రామానికి రాగా అటు అత్తమామలు, ఇటు కన్నతల్లి ఇంట్లోకి రానివ్వ లేదు. దీంతో పిన్ని వద్ద ఉండి ఈ నెల 3న కందుకూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో 7వ తేదీ సాయంత్రం పద్మ పెట్రోల్ తీసుకుని స్టేషన్‌కు వెళ్లి న్యాయం చేస్తారా లేదా చావమంటారా అంటూ నిలదీయడంతో పోలీసులు ఆమె మామ మాలకొండయ్యను శుక్రవారం స్టేషన్‌కు పిలిపించారు. అక్కడ ఏం జరిగిందో గానీ శనివారం మహిళా దినోత్సవం రోజున పుట్టింటిలో ఉన్న పద్మను చితకబాదారు. చంపేస్తానని బెదిరించి ఇంట్లో పెట్టి తలుపు వేసి వెళ్లారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి తలుపుతీశారు. ఎవరూ రానివ్వకపోతే ఎలా బతకాలంటూ ఆమె ప్రశ్నిస్తోంది. దీనిపై ఎస్సై మహేంద్ర నాయక్‌ను వివరణ కోరగా.. అత్తామామలు, తల్లిని పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చామని, పద్మకు ఒక ఇల్లు ఇస్తామని చెప్పారని తెలిపారు.



కట్టపై ఉన్న చిల్లచెట్లను జేసీబీతో తొలగిస్తూ..

# కంచే చేను మేస్తోంది

- నక్కలగండి రిజర్వాయర్‌లో కలప అక్రమంగా నరికివేత
- ఇరిగేషన్ అధికారి కనుసన్నల్లో నిరాటంకంగా దోపిడీ
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



చిల్లకర్రను వాహనంలో లోడ్ చేస్తున్న కూలీలు

**ఉదయగిరి:** వరికుంటపాడు మండలంలోని నక్కలగండి రిజర్వాయర్ కట్టపైన ఉన్న విలువైన వేప, తుమ్మ, చిల్లకర్రను అక్రమార్కులు నరికి స్వాహా చేస్తున్నారు. ఇరిగేషన్ పరిధిలో ఉండే ఈ రిజర్వాయర్‌లో గత 20 రోజుల నుంచి యథేచ్ఛగా ప్రభుత్వ సంపద తరలివెళుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఆ శాఖలో పనిచేసే ఓ అధికారి కనుసన్నల్లోనే ఈ వ్యవహారం జరుగుతోందనే విమర్శలున్నాయి. నక్కలగండి రిజర్వాయర్ ప్రధానమైన సాగునీటి వనరు. దీని కట్టకు ఇరువైపులా ఏళ్ల తరబడి రూ.లక్షల విలువచేసే వేప, తుమ్మ, చిల్లకర్ర పెద్దమొత్తంలో ఉంది. దీనిపై కన్నేసిన అక్రమార్కులు ఇరిగేషన్ శాఖలోని ఓ అధికారి సహకారంతో దోపిడీ మొదలుపెట్టారు. కట్ట దిగువ భాగంలో జేసీబీలు, ఇతర యంత్రాలు ఉపయోగించి వేళ్లతో సహా పెకిలించి కూలీలచేత సైజుల్లో ముక్కలుగా నరికించి వాహనాల ద్వారా బయటకు తరలిస్తున్నారు. ఇప్పటికే సుమారు రూ.25 లక్షలకు పైగా విలువచేసే కలప సంపదను తరలించినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. మరో రూ.50 లక్షలు విలువైన కర్ర ఇంకా మిగిలిఉందని ఆయకట్టు రైతులు చెబుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఏఈ అంకులయ్యను ప్రశ్నించగా తానే ఈ చెట్లు నరకమని చెప్పానని, దీనికోసం ప్రత్యేకంగా ప్రభుత్వం రూ.3 లక్షల నిధులు కేటాయించిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కలపను ఎలా నరికిస్తున్నారని ప్రశ్నించగా తగిన జవాబు రాలేదు. వింజమూరు ఇరిగేషన్ డీఈ రమణరావును ప్రశ్నించగా స్పందించిన ఆయన వరికుంటపాడు ఎస్సై రఘునాథ్‌కు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా అక్కడ కలప లోడ్ చేసిన వాహనాలు ఉన్నప్పటికీ అదుపులోకి తీసుకోకుండా వదిలేసినట్లుగా సమాచారం.



### బిలకూటి క్షేత్రంలో ధ్వజారోహణ

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రం బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణలో భాగంగా గరుడ ధ్వజాన్ని సోమవారం ఆరోహణ చేస్తున్న అర్చకులు.

# వినతులిచ్చి.. దయ చూపమని కోరి..

- కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- అధికారులకు అందిన 309 విన్నపాలు

**నెల్లూరు రూరల్:** జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన జనం తమ సమస్యలపై ఉన్నతాధికారులకు అర్జీలిచ్చి దయ చూపాలని కోరారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, డ్వామా పీడీ గంగాభవాని, డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 308 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూ శాఖవి 133, మున్సిపల్ శాఖవి 30, సర్వేవి 13, పంచాయతీరాజ్ శాఖవి 16, పోలీస్ శాఖవి 43, సివిల్ సప్లయ్స్‌వి 9 తదితర శాఖలవి 309 ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. కాగా అర్జీదారులకు భోజనం అందజేశారు. అన్న క్యాంటీన్లకు సరఫరా చేసే వారు కలెక్టరేట్ వ్యాన్‌లో భోజనం తీసుకొచ్చి వడ్డించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

**కాలువ నిర్మించండి**

25వ డివిజన్ బుజబుజ నెల్లూరు భగత్‌సింగ్ కాలనీలో డ్రైయినేజీలు నిర్మించాలని స్థానికులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో ఒకటో వీధి నుంచి మసీదు వరకు 11 వీధులున్నాయని, అక్కడ కాలువల్లేక ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. అధికారంలో ఉన్న కొందరు కొన్ని ప్రాంతాల్లో మాత్రమే కాలువలు నిర్మిస్తున్నారని తెలిపారు. 300 కుటుంబాలు ఉన్న ఏరియాలో నిర్మించట్లేదని వాపోయారు. ఉయ్యాల శ్రీనివాసులు, కె.కృష్ణమూర్తి, నాగూర్‌బాబు, వెంకటస్వామి, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## లస్కర్లను నియమించాలంటూ..



మాట్లాడుతున్న మాబు

పంట పొలాలకు నీళ్లు వదిలే లస్కర్లు లేనందువల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు ఎస్కే అన్నారు. అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ పెన్నా డెల్టాలో దాదాపు 70 మంది లస్కర్లు ఉండగా వారిని తొలగించారన్నారు. దీంతో రైతులు చాలా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు దుంపల సుబ్బారావు, దాసరి కమలాకర్, బత్తల మధుసూదన్, ధనుంజయ, చిరంజీవి, ఎం.జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతులు ఆపాలి

ఎస్సీ వర్గీకరణ జరిగేంత వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏఎన్‌ఎం గ్రేడ్ – 3, ఇంకా అన్ని శాఖల్లో పదోన్నతులు ఆపాలని మహాజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్ మాదిగ వినతిపత్రం సమర్పించారు. వైద్యారోగ్య శాఖలో ప్రమోషన్లకు సంబంధించి ఈనెల 13న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారని తెలిపారు. కమిషన్ రిపోర్టు ఇచ్చేంత వరకు ఆగి నిర్ణయం తీసుకోవాలని కోరారు. సుధాకర్ పేరయ్య, రవి, ప్రసాద్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు వినతిపత్రం అందజేసిన నాయకులు

## అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ఏర్పాటు కోసం..

ఆంధ్రప్రదేశ్‌లో అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లేకపోవడంతో దూర విద్య విద్యార్థులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని రీజినల్ కో–ఆర్డినేటర్ సెంటర్లలో పనిచేసే సిబ్బంది ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌కు చెందినందున ఈ సంవత్సరం ఏపీలో అడ్మిషన్లు నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గడిచిన మూడేళ్లుగా మన రాష్ట్రంలోని సెంటర్లలో పనిచేస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లకు, సిబ్బందికి జీతాలు కూడా నిలిపివేసినట్లు చెప్పారు. అడ్మిషన్లను చేపట్టాలన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా

# మోసగించారు.. న్యాయం చేయండి



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ కృష్ణకాంత్

- నెల్లూరులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'
- ఎస్పీకి వినతులు అందజేసిన బాధితులు

**నెల్లూరు(క్రైమ్):** ఐటీ లావాదేవీలు చూస్తానని, జాబ్ ఇప్పిస్తానని, బ్యాంక్ లోన్ ఇప్పిస్తానని, ప్లాట్ల పేరిట మోసాలకు పాల్పడ్డారు. వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు ఎస్పీ జి.కృష్ణకాంత్‌ను కోరారు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. వివిధ ప్రాంతాలకు చెందిన 73 మంది తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీకి అందజేశారు. వాటిని పరిశీలించిన ఆయన ఆయా ప్రాంతాల పోలీస్ అధికారులతో మాట్లాడారు. చట్టపరిధిలో సత్వరమే సమస్యల్ని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగర డీఎస్పీ పి.సింధుప్రియ, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ – 2 ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ఫిర్యాదుల సెల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఫిర్యాదుల్లో కొన్ని..

- నా భర్తకు కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఉంది. కోవూరుకు చెందిన సురేష్ చార్టెడ్ అకౌంటెంట్‌నని పరిచయమయ్యాడు. కంపెనీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు చూస్తానని నమ్మించాడు. ఐటీ చెల్లిస్తానని రూ.1.27 కోట్లు తీసుకున్నాడు. ఇటీవల ఐటీ కట్టలేదని నోటీసులొచ్చాయి. విచారించగా సురేష్ సీఏ కాదని తేలింది. అతడిని ప్రశ్నించగా దౌర్జన్యం చేస్తున్నాడని నెల్లూరు వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- నెల్లూరుకు చెందిన డానియల్ ద్వారా ప్రమీల అనే మహిళ పరిచయమైంది. వారిద్దరూ తిరుపతి గోశాలలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.3 లక్షలు తీసుకున్నారు. నెలలు గడుస్తున్నా జాబ్ రాకపోవడంతో నిలదీయగా నానా దుర్భాషలాడుతున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని జువ్వలదిన్నెకు చెందిన వ్యక్తి కోరారు.
- నెల్లూరు బాలాజీనగర్‌కు చెందిన శ్రీధర్, ఈశ్వరయ్యలు నా వ్యాపారానికి తోడ్పాటునందించేందుకు బ్యాంక్‌లో లోన్ ఇప్పిస్తానని నమ్మించి వివిధ పత్రాలు తీసుకున్నారు. నాకు తెలియకుండా రూ.10 లక్షల లోన్ తీసుకుని వారు వాడుకున్నారు. నేను ప్రశ్నించగా దిక్కున్నచోట చెప్పుకోమంటున్నారని నవాబుపేటకు చెందిన ఓ మహిళ వినతిపత్రం ఇచ్చారు.
- బుచ్చికి చెందిన శ్రీధర్‌రెడ్డి, మోహన్‌లు నా స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాన్ని తీసుకెళ్లి నాకు తెలియకుండా అమ్మేశారు. వారిని అడిగితే బెదిరిస్తున్నారని బుచ్చికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.
- వెంకటాచలం మండలం పాలిచర్లపాడులో లేఅవుట్‌లోని స్థలాలను నెల్లూరుకు చెందిన శ్రీనివాసరావు మాకు విక్రయించాడు. ఇటీవల ఆ స్థలాన్ని కొందరు చదును చేసి వ్యవసాయం చేసుకుంటుండగా మేం అడ్డుకున్నాం. శ్రీనివాసరావు స్థలం తాలూకా డబ్బులు ఇంకా ఇవ్వకపోవడంతో సాగు చేసుకుంటున్నామని వారు చెప్పారు. రెవెన్యూ అధికారులను సంప్రదించగా వ్యవసాయేతర భూమిగా మార్చకుండా, నుడా అప్రూవల్ పొందకుండానే శ్రీనివాసరావు లేఅవుట్ వేసి ప్లాట్లు విక్రయించినట్లు తేలింది. తమను మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరారు.
- నా పెద్ద కుమారుడు బాగోగులు చూసుకుంటానని నమ్మించి ఆస్తి మొత్తం రాయించుకున్నాడు. కొంతకాలంగా పట్టించుకోకుండా ఇబ్బందులు పెడుతున్నాడు. విచారించి న్యాయం చేయాలని సంతపేటకు చెందిన వృద్ధుడు ఫిర్యాదు చేశాడు.

## వృద్ధుడి బలవన్మరణం

**బిట్రగుంట:** బోగోలు మండలం చెంచులక్ష్మీపురం గ్రామానికి చెందిన బిజ్జం వెంకారెడ్డి (75) తన ఇంట్లోనే ఉరేసుకుని సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. వెంకారెడ్డి కుటుంబ సభ్యులంతా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆయన ఒక్కడే స్థానికంగా నివాసం ఉంటున్నాడు. ఆ ఇంట్లో తిరుపతికి చెందిన శాంతమ్మ అనే మహిళ ఏడాది నుంచి పనిమనిషిగా ఉంది. ఈనెల 4వ తేదీన యజమాని మందలించాడనే కారణంతో శాంతమ్మ ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో ఏం జరిగిందో గానీ వారం తిరిగేసరికి వెంకారెడ్డి కూడా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీస్



## ఇంటర్ పరీక్షలకు 367 మంది గైర్హాజరు

**నెల్లూరు(టౌన్):** ఇంటర్మీడియట్ పరీక్షలకు సోమవారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 367 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్‌కు సంబంధించి 21,313 మందికి గానూ 20,990 మంది హాజరై, 323 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి వెయ్యి మందికి గానూ 956 మంది హాజరై 44 మంది గైర్హాజరయ్యారు. ఆర్‌ఐఓ శ్రీనివాసులు నెల్లూరులోని డీకేడబ్ల్యూ, బీవీకే, రామలింగాపురంలోని శ్రీచైతన్య, హరనాథపురంలోని నారాయణ జూనియర్ కళాశాలల్లో పరీక్షల నిర్వహణను తనిఖీ చేశారు.

# తెలుగు తమ్ముళ్ల అధికార గర్వం

- మద్యం తాగొచ్చి స్కూల్ వార్షికోత్సవంలో జీభత్సం
- టీచర్, మరో వ్యక్తిపై దాడి

**తోటపల్లిగూడూరు:** అధికారంలో ఉన్నామని తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోతున్నారు. సోమవారం ఓ స్కూల్ వార్షికోత్సవంలో బీభత్సం సృష్టించారు. వివరాలు.. చెన్నపల్లిపాళెం ఉన్నత పాఠశాలలో సోమవారం ఉదయం సరస్వతి పూజ, పాఠశాల వార్షికోత్సవం జరిగింది. పూజ అనంతరం మధ్యాహ్నం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కోడూరు పంచాయతీ వెంకటేశ్వరపట్టపుపాళెం, ముత్యాలతోపు పట్టపుపాళెం గ్రామాల్లోని టీడీపీకి చెందిన యువకులు మద్యం తాగి స్కూల్‌కు చేరుకుని విద్యార్థులు నృత్యాలు చేస్తుండగా కేకలు, అరుపులతో గంతులేశారు. తాము కోరిన పాటలు పెట్టాలంటూ ఆర్కెస్ట్రా నిర్వాహకులతో గొడవకు దిగారు. అంతటితో ఆగకుండా ల్యాప్‌టాప్‌ను ధ్వంసం చేశారు. ఇదేంటని అడిగిన సౌండ్ సిస్టం ఆపరేటర్‌పై దాడికి దిగారు. టీచర్లు సర్దిచెప్పేందుకు ప్రయత్నించారు. మద్యం మత్తులో ఉన్న యువకులు ఓ టీచర్‌పై దాడి చేసి అతడి సెల్‌ఫోన్‌ను పగులగొట్టారు. దీంతో భయాందోళనకు గురైన విద్యార్థులు, టీచర్లు బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనపై హెచ్‌ఎం సాయిప్రసాద్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.



దెబ్బతిన్న ల్యాప్‌టాప్

## పేకాట స్థావరంపై దాడి

- తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మూడు కార్లు, ఒక బైక్, రూ.15 వేల నగదు స్వాధీనం

**నెల్లూరు సిటీ:** గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై నెల్లూరు రూరల్ పోలీసులు సోమవారం దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. నెల్లూరు రూరల్ పరిధిలోని వడ్డెపాళెంలో ఓ ఇంటి పక్కన కొందరు వ్యక్తులు కొన్నిరోజులుగా పేకాట స్థావరాన్ని నిర్వహిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం రూరల్ పోలీసులు దాడులు చేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. రూ.15,400 నగదు, మూడు కార్లు, ఒక మోటార్‌బైక్, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపరిచారు.

## లైంగికదాడి యత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

**నెల్లూరు(లీగల్):** బాలికపై లైంగికదాడికి ప్రయత్నించాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి గ్రామానికి చెందిన ఎడమకంటి వెంకటేశ్వర్లు అనే వ్యక్తికి శిక్ష పడింది. ఐదేళ్ల జైలు, రూ.25 వేల జరిమానా, ఇంకా బాధిత బాలికను దూషించిన ఎడమకంటి రమణమ్మ, ఓబయ్య, నాగార్జున, మహేష్‌కు రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. పడమటినాయుడుపల్లికి చెందిన బాలిక 2016 సంవత్సరం మార్చి 7వ తేదీన ఉదయం ఇంట్లో ఒంటరిగా ఉండగా వెంకటేశ్వర్లు వెళ్లి అసభ్యకరంగా ప్రవర్తించి లైంగికదాడికి ప్రయత్నించాడు. బాలిక తప్పించుకెళ్లి బంధువులతో ఈ విషయం చెబుతోంది. ఈ సమయంలో నిందితుడి కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చి బాలికను అవమానకరంగా దూషించి బెదిరించారు. ఈ ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మర్రిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితులపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితులకు పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

## పీహెచ్‌సీలకు చేరిన ఇన్సులిన్ వైల్స్

**ఆత్మకూరు:** షుగర్ వ్యాధిగ్రస్తులకు అందజేసే ఇన్సులిన్ వైల్స్ రెండు రకాలను ప్రభుత్వం సరఫరా చేసింది. సోమవారం ఉదయం నాటికి అన్ని పీహెచ్‌సీలకు జిల్లా సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి సరఫరా అయ్యాయి. గత నెల 20వ తేదీన సాక్షిలో 'ఇన్సులిన్‌కూ కటకటే' అనే శీర్షికతో కథనం వచ్చిన విషయం తెలిసిందే. ప్రభుత్వం కేరళ రాష్ట్రం నుంచి ఇన్సులిన్‌ను తెప్పించింది. 70 శాతం అందుబాటులోకి వచ్చిందని సిబ్బంది పేర్కొన్నారు.



ఇన్సులిన్ వైల్స్

సాక్షి ఎఫెక్ట్..

## మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తూ..


**సోమశిల:** మండల కేంద్రమైన అనంతసాగరం గ్రామానికి చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో వీరంగం సృష్టిస్తూ చోరీలకు పాల్పడుతుండటంతో సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి కథనం మేరకు.. ఎస్సీ కాలనీకి చెందిన పెనగలూరి రాజేంద్ర (బళ్లారి) గతంలో ఐస్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. ఇతడికి మద్యం అలవాటు ఉంది. డబ్బుల్లేనప్పుడు వృద్ధులు, ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడి చేసి నగదు, సెల్‌ఫోన్లు లాక్కొని పరారవుతుంటాడు. దుకాణాల్లో సామగ్రి, ఇళ్ల ముందు ఉండే బైక్‌లు, సైకిళ్లు తీసుకెళ్లి విక్రయించి మద్యం తాగుతుంటాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. శనివారం రాత్రి పాతదేవరాయపల్లి దర్గాలో జరిగిన చోరీకి ఇతడే బాధ్యుడని తెలిసింది. ఇంకా ఓ ఇంట్లో వస్తువులు, బైక్ చోరీ చేశాడని గుర్తించారు. రాజేంద్రపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

## భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

**నెల్లూరు(క్రైమ్):** భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తను నెల్లూరు సంతపేట పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. పొర్లుకట్టకు చెందిన రహంతుల్లా అలియాస్ మున్నా, సమీనా (37)లు దంపతులు. భర్త వేధింపులు తాళలేక సమీనా ఆదివారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి బీబీజాన్ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు మున్నాపై కేసు నమోదు చేశారు. సోమవారం రాత్రి పొర్లుకట్ట సుందరయ్యనగర్ వద్ద అతడిని అరెస్ట్ చేశారు.

## నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.90
సన్నవి : రూ.60
పండ్లు : రూ.40



### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 92 |
| లేయర్ (లైవ్) | : 90 |
| బ్రాయిలర్ చికెన్ | : 170 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 190 |
| లేయర్ చికెన్ | : 153 |